క్లుప్తంగా

విద్యార్థి మృతదేహం లభ్యం



కొండూరుపాళెం వద్ద తీరానికి కొట్టుకు వచ్చిన భానుప్రకాష్ మృతదేహం

వాకాడు: సముద్రంలో గల్లంతైన మరో విద్యార్థి ఇంగిలా భానుప్రకాష్(18) మృతదేహం శనివారం కొండూరుపాళెం సముద్ర తీరానికి కొట్టుకు రావడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 9న మల్లాంలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరానికి వెళ్లారు. అక్కడ సరదాగా స్నానాలు ఆచరిస్తుండగా ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. వాకాడు, దుగ్గరాజపట్నం మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు, బంధువులు తీవ్రంగా గాలించగా శుక్రవారం మామిడి లోకేష్ మృతదేహం లభించింది. మరో విద్యార్థి ఇంగిలాల భానుప్రకాష్(17) మృతదేహం కొండూరుపాళెం తీరానికి కొట్టుకు రావడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైట్‌కుప్పం, కొక్కుపాళెం గ్రామాల్లో విషాదం నెలకొంది. వాకాడు ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



చిల్లకూరు : మండలంలోని చేడిమాలలో పది మంది దివ్యాంగులకు శనివారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు ట్రైసైకిళ్లు అందజేశారు. ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు మాట్లాడుతూ ట్రై సైకిళ్లు అవసరమైన గూడూరు నియోజకవర్గంలోని దివ్యాంగులు తమ కార్యాలయంలో తెలియజేస్తే ట్రై సైకిళ్లు అందజేస్తామన్నారు. ప్రస్తుతం గూడూరు రూరల్, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన పది మందికి అందజేశామన్నారు. ట్రస్టు ప్రతినిధులు రాజనేని పిచ్చయ్య నాయుడు, రామానాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, బాబు, భాస్కర్ పాల్గొన్నారు.

గోకులాలు ప్రారంభం

దొరవారిసత్రం : మండలంలోని ఏకొల్లు పంచాయతీలో నిర్మించిన రెండు గోకులాల షెడ్లను శనివారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.2.30 లక్షలతో రైతుల కోసం గోకులాలను నిర్మించినట్టు తెలిపారు. వాటిని రైతులు సక్రమంగా ఉపయోగించుకోవాలని కోరారు. ఎంపీడీవో గోవర్ధన, ఏపీడీ వరప్రసాద్, ఏపీవో భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతను పఠించాలి

చిల్లకూరు : మనిషి ఎలా జీవించాలనే విషయాన్ని తేటతెల్లం చేస్తూ శ్రీకృష్ణుడు చెప్పిన భగవద్గీతను జీవితంలో ఒక్కసారైనా చదవాలని చింతి సుబ్రమణ్యం తెలిపారు. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ ఆధ్వర్యంలో శనివారం బూదనంలో భగవద్గీత పఠనంపై అవగాహన కల్పించారు. ప్రజలకు భగవద్గీత ప్రతులను ఉచితంగా అందజేశారు. భోగి పండుగలో కర్మ అనే కట్టెలు కాలుస్తారని, యోగులు జన్మకర్మలను కాల్చుకుని ఉత్తరాయణంలో ప్రవేశిస్తారని పేర్కొన్నారు.

ఆశించిన రద్దీ ఏదీ?

- వైకుంఠ ఏకాదశి, ద్వాదశికి గణనీయంగా తగ్గిన రద్దీ
- భక్తుల తొక్కిసలాట నేపథ్యంలో వెలవెలబోతున్న కొండ



నిర్మానుష్యంగా ఉన్న భక్తులు క్యూకాంప్లెక్స్‌లోకి వెళ్లే క్యూ

తిరుమల: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో పరిమిత సంఖ్యలోనే భక్తులకు టీటీడీ దర్శన భాగ్యం కల్పించింది. గతంలో పోల్చుకుంటే ఈ వైకుంఠ ఏకాదశికి 60,094 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది టికెట్లు జారీచేసిన సంఖ్య కంటే తక్కువ సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో శ్రీవారికి రూ.2.45 కోట్లు సమర్పించారు. ఇక 14,906 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

గత ఏడాది ఇలా..

గత ప్రభుత్వ హయాంలో వైకుంఠ ద్వార దర్శనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించారు. తొక్కిసలాటలకు తావు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గత ఏడాది 23–12–2023న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవారిని 67,906 మంది దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో శ్రీవారికి రూ.2.5 కోట్లు లభించాయి. 28,492 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

వరుసగా సెలవులొచ్చినా..

సెలవు దినాలు వస్తే తిరుమల భక్తజన సందోహంతో నిండిపోయేది. ఆలయ మాడ విధులు, క్యూలైన్లు అన్నీ భక్తులతో కిక్కిరిసి పోయేవి. శ్రీవారి దర్శనానికి సరాసరి 36 నుంచి 48 గంటల సమయం పట్టేది. వారాంతపు రద్దీ రోజుల్లో 85 వేల మందికి పైగా భక్తులు శ్రీవారిని దర్శించుకునేవారు. అయితే ఈ యేడు సంక్రాంతి సెలవులొచ్చినా తిరుమలలో ఆశించిన స్థాయిలో భక్తుల రద్దీ కానరావడం లేదు. సాధారణ రద్దీకన్నీ తక్కువగానే ఉంది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రద్దీ అనుకున్న మేర కనిపించలేదు. ఆరుగురు భక్తులు మృతిచెందడం, ఏర్పాట్లలో అలసత్వం వెరసి కొండకు రావాలంటేనే భయమేస్తోందని పలువురు భక్తులు వాపోతున్నారు.



జీఎన్‌సీ టోల్‌గేట్ వద్ద ఖాళీగా ఉన్న లగేజీ కౌంటర్

పది శాతం తగ్గిన రద్దీ

గత ఏడాదితో పోల్చుకుంటే వైకుంఠ ఏకాదశికి ఈ ఏడాది 10 శాతం మేర భక్తులు తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాదిలో 7,906 మంది భక్తులకు అదనంగా శ్రీవారి దర్శన భాగ్యం దక్కింది.

అవి ఒట్టిమాటలేనా?

సామాన్యులకు పెద్ద పీట వేస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి ఆర్భాటం చేశారు. సామాన్యులకు గతంలో ఎన్నడూ జరగని విధంగా దర్శన భాగ్యం చేయిస్తామని ఊదరగొట్టారు. మూడు గంటల్లోపే శ్రీవారి దర్శనం అంటూ ఊరించారు. ఈ మేరకు భారీగా టోకెన్ల జారీ కౌంటర్ల వద్దకు చేరుకునేలా చేశారు. కానీ అక్కడ సరైన ఏర్పాట్లు చేయక పోవడం, భద్రతా లోపంతో భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయేలా చేశారు. ఈ నేపథ్యంలో అధికారుల ఆర్భాటం ప్రకటనల వరకే పరిమితమైందని పలువురు ఆరోపిస్తున్నారు.

తొక్కిసలాట నేపథ్యంలో..

ఇటీవల తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తిరుమలలో క్యూలైన్ పెరిగింది. టీటీడీ సౌకర్యాలను పటిష్టంగా చేయని కారణంగా మళ్లీ తోపులాట జరిగే అవకాశం ఉందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. దీంతో స్వామి వారిని సాధారణ రోజుల్లో కన్నా తక్కువ మంది దర్శించుకుంటున్నారు.

సౌకర్యాలు కల్పించారా?

గతంలో పోల్చుకుంటే ఈ ఏడాది కనీస సౌకర్యాల కల్పనలో కూడా టీటీడీ నిర్లక్ష్యం వచ్చింది. సామాన్య భక్తులకు సేవ చేయాల్సింది పోయిం.. వీఐపీ సేవలకే పరిమితమైంది. అధికారులు కనీసం సామాన్య భక్తుల వద్దకు వచ్చి సౌకర్యాలపై అడిగి దాఖలాలు లేవు. మూడు గంటల్లో దర్శనం అని చెప్పిన అధికారులుం క్యూలోకి వెళ్లాకం 6 నుంచి 7 గంటల వరకు కంపార్ట్‌మెంట్లలో కూర్చోబెట్టారు. కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదు.

డక్కిలి వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న రమేష్

డక్కిలి : మండలంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన నావూరు బందెల రమేష్‌కు డాక్టరేట్ లభించింది. ఆయన ప్రాచీన, ఆధునిక ఆంగ్ల సాహిత్యంపై పరిశోధన చేశారు. ఈ మేరకు అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. తమిళనాడులోని రాజా అన్నామలై మంద్రంలో శుక్రవారం డాక్టరేట్ల ప్రదానోత్సవంలో బందెల రమేష్‌కు యూనివర్సిటీ చైర్మన్ పి మాన్యువల్, వైస్ చాన్సలర్, కె.వెంకటేశన్ డాక్టరేట్ అందజేశారు.

14న మకరజ్యోతి పూజలు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 14న కేరళకు చెందిన స్వాములతో మకరజ్యోతి పూజలు నిర్వహించనున్నట్టు టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, ఆలయ ధర్మకర్త వేనాటి రామచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భోగి పండుగ రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తామని, 14న శబరిమలైలో జ్యోతి దర్శనం సమయంలో ఇక్కడ కూడా జ్యోతి దర్శనం ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. 17, 18 తేదీల్లో స్వామి వారి 18 మెట్లకు పడిపూజ చేస్తామని వెల్లడించారు.

జూనియర్ టెన్నికాయిట్‌కు జిల్లా జట్టు

గూడూరు రూరల్ : శ్రీకాకుళంలోని పలాసలో జరిగే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు జిల్లా నుంచి జట్టును పంపుతున్నట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్యామ్ సుందర్ తెలిపారు. ఆయన శనివారం గూడూరు రైల్వే స్టేషన్‌లో క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పైడా కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పి.భాస్కర్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

- రూ.20 లక్షల విలువ చేసే 9 మోటార్ బైక్‌లు స్వాధీనం



నిందితులను హాజరుపరిచి వివరాలను వెల్లడిస్తున్న సీఐ బాబి , ఐడీ పార్టీ పోలీసులు

నాయుడుపేటటౌన్: చెడు వ్యసనలకు బానిసలై దొంగతనాలకు అలవాటు పడ్డ ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను ప్రత్యేక నిఘా పెట్టి శనివారం అరెస్టు చేసినట్లు సీఐ ఎం.బాబి వెల్లడించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.20 లక్షల విలువ చేసే 9 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద నిందితులను హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. పట్టణంలో తరచూ మోటార్ బైక్‌లు చోరీకి గురవుతుండడంతో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సారథ్యంలో సీఐతో పాటు ఐడీ పార్టీ పోలీసులతో ప్రత్యేక నిఘా పెట్టినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో శనివారం మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామ సమీపంలో బిరదవాడ జాతీయ రహదారి వద్ద ఇద్దరు వ్యక్తులు మోటార్ బైక్‌లలో అనుమానాస్పదంగా నిలుచుకుని ఉండడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నాయుడుపేట పట్టణంలోని అమరాగార్డెన్ వీధికి చెందిన షేక్ సమీఉల్లా, తమిళనాడులోని గుమ్మడిపూండి ప్రాంతానికి చెందిన బీ.అర్జున్ అలీయాస్ జబ్బరాజ్‌లుగా గుర్తించారు. వీరిద్దరితో పాటు తమిళనాడుకు చెందిన రమేష్ అనే వ్యక్తి ముగ్గురూ కలిసి కొత్త మోటార్ బైక్‌లను తమిళనాడు, నాయుడుపేట ప్రాంతాల్లో చోరీలు చేసేవారు. తమిళనాడు బైక్‌లు ఆంధ్రాలో, ఆంధ్రాలో దొంగలించిన వాటిని తమిళనాడు ప్రాంతాల్లో విక్రయించేవారు. ఈ క్రమంలో నిందితులు చోరీకి పాల్పడిన 9 మోటార్ బైక్‌లను విక్రయానికి సిద్ధం చేసి ఉండడాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందన్నారు. ఇందులో నాలుగు బైక్‌లు నాయుడుపేట ప్రాంతంలో చోరీకి గురైనవని తెలిపారు. మిగిలిన ఐదు బైక్‌లు తమిళనాడు ప్రాంతానికి చెందినవిగా గుర్తించారు. పరారీలో ఉన్న తమిళనాడుకు చెందిన రమేష్‌ను పట్టుకునేందుకు నిఘా పెట్టినట్టు తెలిపారు. దొంగలను చాకచక్యంగా పట్టుకున్న సీఐతో పాటు ఐడీ పార్టీ పోలీసులను డీఎస్పీ చెంచుబాబు అభినందించారు. వాహనాదారులు ఇళ్ల వద్ద పార్కింగ్ చేసే సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని సీఐ సూచించారు. ఎవరన్నా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే 94407 96357కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.



నిందితుల నుంచి రికవరి చేసిన మోటార్ బైక్‌ల వద్ద సీఐ బాబి, ఐడీ పార్టీ పోలీసులు

ఘనంగా శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం



పట్టాలు ప్రదానం చేస్తున్న అతిథులు



స్నాతకోత్సవంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

- ముఖ్య అతిథిగా హాజరైన ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్
- 298 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీ కళాశాల 2024 స్నాతకోత్సవం శనివారం సందడి వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో 298 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవీ కార్తీకేయన్ పట్టాలను ప్రదానం చేశారు. ఐఐటీ చైర్‌పర్సన్ జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, సీఈఓ డాక్టర్ శ్రీధర్ వెంబూ వర్చువల్‌గా సమావేశానికి అధ్యక్షత వహించారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ముఖ్యఅతిథిగా ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, క్యాటర్‌పిల్లర్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ భువన్ ఆనందకృష్ణన్, ఏడబ్ల్యూఎస్ ఇండియా చీఫ్ టెక్నాలజిస్ట్ శాలినీ కపూర్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కార్తీకేయన్ 2023–24 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను సమర్పించారు. విద్యా పరిశోధన, క్రీడా రంగాలను తమ సంస్థ సాధించిన విషయాలను వివరించారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంలో ప్రావీణ్యాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు. మనిషి విజయం సాధించాలంటే ఆసక్తి, నిబద్ధత, ప్రావీణ్యం, సంకల్పం, ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం వంటి ఆరు ముఖ్య లక్షణాలు అవసరమని ఇస్రో చైర్మన్ వివరించారు. వినయం, నిజాయితీ, సమగ్రత, వృత్తిపరంగా వ్యక్తిగత జీవితంలో ఎంతో అవసరమని ఆయన గుర్తుచేశారు. ఈ స్నాతకోత్సవంలో ఐదుగురికి పీహెచ్‌డీ, ఇద్దరికి ఎంఎస్, మరో ఇద్దరికి ఎంటెక్, 298 మందికి బీటెక్ పట్టాలను ప్రదానం చేశారు.

అర్చకులకు పంచాంగాల పంపిణీ

సూళ్లూరుపేట : వాకాడు మండలం బాలిరెడ్డిపాళెంలోని శ్రీ పట్టాభి రామాలయం కేంద్రంగా నడుస్తున్న సీతారామ ధార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలోని గాయత్రీ బ్రాహ్మణ సేవా సమాఖ్య నేతృత్వంలో శనివారం 300 మంది అర్చకులకు పంచాంగాలు అందజేశారు. వీటిని శ్రీమద్వేంకట రామమూర్తి స్వామి ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ అనంతకుమార్ దీక్షితులు–స్వాతి దంపతుల ఆర్థిక సౌజన్యంతో ముద్రించారు. గాయత్రీ బ్రాహ్మణ సేవా సమాఖ్య వ్యవస్థాపకుడు కారంచేటి మల్లికార్జున శర్మ, సంస్థ ప్రతినిధి పారా హేమంత్‌కుమార్ శర్మ, సేవా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పారా శోభన సురేంద్ర, కాశీభట్ల సీతారామయ్య, పంత్రంగం అనంత పద్మనాభ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

విజేతలకు నగదు బహుమతులు



పెళ్లకూరు: స్థానిక పెళ్లకూరులోని చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్ నగదు బహుమతులు అందజేవారు. పోటీల్లో శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, బుచ్చినాయుడుకండ్రిగ, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల నుంచి 180 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి శాంతి ప్రియ, భవానీ గ్రూపునకు రూ.10 వేలు, ద్వితీయ బహుమతి వెన్నెల, కీర్తన గ్రూపునకు రూ.5 వేలు, తృతీయ బహుమతి నిఖిత రూ.2500 అందజేశారు. అలాగే మహిళలందరికీ ప్రోత్సాహక నగదు బహుమతులు ఇచ్చారు. ట్రస్ట్ సీఈవో పెనుబల్లి సీతారామయ్య, ఏవో గల్లా కృష్ణ పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందజేత

గూడూరు రూరల్ : తాము విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తామని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య తెలిపారు. ఆయన శనివారం కళాశాలలో క్రికెట్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మద్రాస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీల్లో అనంతపురం జేఎన్‌టీయూ తరఫున పాల్గొనే జట్టుకు శిక్షణ ఇచ్చామన్నారు. గుడ్లూరు రవిచంద్ర, ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వీకేఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టాస్ వేస్తున్న వెందోటి కార్తీక్‌రెడ్డి

బాలాయపల్లి(సైదాపురం): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బాలాయపల్లి మండలం జయంపు గ్రామంలో శుక్రవారం వీకేఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 వరకు పోటీలు జరుగుతాయన్నారు. తొలిరోజు గొట్టికాడు–పెరిమిడి గ్రామాల జట్లు తలపడ్డాయి. పెరిమిడి జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో నిర్వాహకులు డి.కోటి, జి.నాగరాజు, డి.వెంకటేష్, పి.లోకేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కలువాయి: కలువాయిలో శనివారం కలువాయి, చేజర్ల, రాపూరు, అనంతసాగరం మండలాల వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిశోర్‌రెడ్డి, చల్లా శివారెడ్డి ప్రారంభించారు. నిర్వాహకులు నాగరాజు మాట్లాడుతూ పోటీల్లో 8 జట్లు పాల్గొంటున్నాయని, భోగి పండుగ నాడు ఫైనల్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తామని తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

సైదాపురం: సంక్రాంతి పండుగ సందర్భంగా జూదం, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ క్రాంతికుమార్ హెచ్చరించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

భోగికి సిద్ధమవుతున్న పల్లెలు



భోగి మంటల కోసం తాటాకులను తరలిస్తున్న పల్లెవాసులు

- భోగి మంటలకు తాటాకుల కట్ట రూ.100
- స్వగ్రామాలకు చేరుకుంటున్న ప్రజలు

చిల్లకూరు : మూడు రోజులు జరుపుకునే సంక్రాంతి పండుగలో భోగి పండుగకు పల్లెలు సిద్ధమవుతున్నాయి. ఉద్యోగ, ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో టోల్ ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇళ్ల వద్ద మహిళలు పిండి వంటలు తయారు చేస్తుండగా, చిన్నారులు భోగి మంటలు వేసుకునేందుకు అవసరమైన వస్తువులను సేకరిస్తున్నారు. అదేవిధంగా పల్లెల్లో కోడి పందేలు నిర్వహించేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారు.



భోగి మంటలకు ఆకులు తీసుకెళుతున్న వ్యక్తి

నూతన బస్సు ప్రారంభం

రాపూరు: రాపూరు ఆర్టీసీ డిపో నుంచి శనివారం నూతన బస్సు సర్వీసును ప్రారంభించినట్లు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ డిపోకు రెండు కొత్త బస్సులు వచ్చాయన్నారు. ఒక బస్సు రాపూరు, నెల్లూరు మీదుగా కడపకు నడుపుతున్నట్లు చెప్పారు. మరో బస్సును రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంఎఫ్ కరీముల్లా, ఎస్టీఐ బషీర్ అహ్మద్ పాల్గొన్నారు.



రాపూరు నుంచి కడపకు బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం అనీల్‌కుమార్

రోగులకు కంటి అద్దాలు పంపిణీ

రాపూరు: మండలంలోని రావిగుంటపల్లి సమీపంలో ఉన్న నజరేత్ లెప్రసీ కాలనీలోని కుష్టువ్యాధిగ్రస్తులకు శనివారం వేపనాపి పీహెచ్‌సీ వైద్యులు సూర్యధర్మేంద్ర తన సొంత నిధులతో కంటి అద్దాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలనీలో కంటి పరీక్షలు చేశామని, 12 మందికి అద్దాలు అవసరమున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సరిత, విజయలక్ష్మి, సరితకుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

సైదాపురం/చిల్లకూరు/సూళ్లూరుపేట : వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని మండలాలకు పార్టీ అధ్యక్షుల ను నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అధ్యక్షులుగా నియమితులైన వారు పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గాల సమన్వయ కర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

వెంకటగిరి నియోజకవర్గంలో..

సైదాపురం మండల అధ్యక్షుడిగా మన్నారపు రవికుమార్‌యాదవ్, రాపూరు మండలానికి బి.మధుసూదన్‌రెడ్డి, డక్కిలి మండలానికి చిత్తల శ్రీనివాసులురెడ్డి, వెంకటగిరి టౌన్‌కు పులి ప్రసాద్‌రెడ్డి, వెంకటగిరి మండలానికి కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బాలాయపల్లి మండలానికి వెందోటి కార్తీక్‌రెడ్డి, కలువాయి మండలానికి ఎం.వెంకటకృష్ణారెడ్డి నియమితులయ్యారు.

గూడూరు నియోజకవర్గంలో..

గూడూరు పట్టణ అధ్యక్షుడిగా బొమ్మిడి శ్రీనివాసులు, గూడూరు రూరల్‌కు మల్లు విజయకుమార్‌రెడ్డి, చిల్లకూరుకు యద్దల మధుసూదన్‌రెడ్డి, కోటకు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, వాకాడుకు నేదురుమల్లి ఉదయశేఖరరెడ్డి, చిట్టమూరుకు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు.

సూళ్లూరుపేట నియోజకవర్గంలో..

సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడిగా వేల్లపాళెం కృపాకర్‌రెడ్డి, సూళ్లూరుపేట మండలానికి అల్లూరు అనీల్ కుమార్‌రెడ్డి, నాయుడుపేట పట్టణ అధ్యక్షుడిగా కలికి మాధవరెడ్డి, నాయుడుపేట మండలానికి ఒట్టురు కిషోర్ యాదవ్, తడ మండలానికి కిలివి ఆర్ముగం, దొరవారిసత్రం మండలానికి అల్లూరు రాహుల్ రెడ్డి, పెళ్లకూరు మండలానికి ఒబ్బు వెంకటరత్నం, ఓజిలి మండలానికి పాదర్తి హరినాథ్‌రెడ్డి నియమితులయ్యారు.

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ

రాపూరు : పెంచలకోనలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు ఊంజల్ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. తిరుప్పావై, పూలంగి సేవ చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం నిర్వహించారు. తదుపరి సాయంత్రం ఊంజల్ సేవ చేపట్టారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ఆవరణలోని కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు దివి లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ అయితా శ్రీధర్ ఆధ్వర్యంలో కల్యాణాన్ని కనుల పండువగా చేపట్టారు.



స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊంజల్ సేవ మండపానికి తీసుకువస్తున్న అర్చకులు





దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన మేనకూరు సెజ్

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవతో మేనకూరులో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటు చేయడం, చెన్నై, తిరుపతి నగరాలకు సమీపంలో ఉండడంతో నాయుడుపేట వార్తక, వాణిజ్య కేంద్రంగా దిన దినాభివృద్ధి చెందుతోంది. సెజ్‌లో అనేక పరిశ్రమలు రావడంతో పారిశ్రామిక ప్రాంతంగా కూడా గుర్తింపు తెచ్చుకుంది. డివిజన్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు, ఆస్పత్రులు ఉండడంతో ప్రజలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకునేందుకు మక్కువ చూపుతున్నారు.

అభివృద్ధి పథంలో నాయుడుపేట



నాయుడుపేట పట్టణం ఏరియల్ వ్యూ



నాయుడుపేట పట్టణ పరిధిలో ఉన్న స్వర్ణముఖి నది వ్యూ

- పరిశ్రమల ఏర్పాటుతో దినదినాభివృద్ధి
- చెన్నై నగరంతోపాటు ప్రపంచ పుణ్య క్షేత్రం తిరుమలకు కూడలి
- రింగ్ రోడ్డు ఏర్పాటుతో మరింత అభివృద్ధి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీలో 25 వార్డులు ఉన్నాయి. సుమారు 77 వేలకు పైగా జనాభా ఉంది. ఉపాధితోపాటు వ్యాపారాలు, ఇతర కూలి పనులు చేసుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివాసం ఉంటున్న వారు సుమారు 20 వేల మందకి పైగా ఉన్నారు. ఇక్కడ తాగునీటికి ప్రధాన వనరుగా స్వర్ణముఖి నది ఉంది. నాయుడుపేటకు సమీపంలో చెన్నై పట్టణం ఉండడంతో వ్యాపార కూడలిగాను మంచి గుర్తింపు తెచ్చుకుంది. రేణిగుంట, చెన్నై విమానాశ్రయాలు అందుబాటులో ఉండడంతో నాయుడుపేట నుంచి ఇతర ప్రాంతాలకు పలు వస్తువులు రవాణా అవుతున్నాయి. ఇక్కడ వ్యాపార లావాదేవీలు పట్టణాలకు దీటుగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీ దుకాణ సముదాయంలోని గదులకు రూ.20 వేలకు పైగా అద్దె చెల్లిస్తుండడమే ఇందుకు నిదర్శనం.

అందుబాటులో కార్పొరేట్ విద్య, వైద్యం

నాయుడుపేట పట్టణంలో అనేక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థలు ఉన్నాయి. ప్రముఖ కార్లు, లారీలు, ద్విచక్ర వాహనాల షోరూములు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ బ్యాంకులు, కార్పొరేట్ బ్యాంకులు వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి.



నాయుడుపేటలోని 71వ నంబరు జాతీయ రహదారిపై నిర్మిస్తున్న రింగ్ రోడ్డు

జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం

నాయుడుపేటలో నెల్లూరు, తిరుపతి, చెన్నై, బెంగళూరు నగరాలకు దీటుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతోంది. నాయుడుపేట పారిశ్రామిక, వ్యాపార కేంద్రంగా ఉండడంతో ఇక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకునేందుకు ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. నాయుడుపేట నుంచి తిరుపతి వరకు ఇటీవల 71వ నంబరు జాతీయ రహదారి పూర్తికావడంతో రవాణా సౌకర్యం మెరుగుపడడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. నాయుడుపేట పట్టణంలో జాతీయ రహదారి రింగ్ రోడ్డు ఏర్పాటు మరింత అభివృద్ధికి దోహదపడుతోంది.

పోలేరమ్మ జాతర, ఏటి పండుగ ఇతర ఉత్సవాలు

నాయుడుపేట పట్టణంలో ప్రతి ఏటా గ్రామ దేవత పోలేరమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అదేవిధంగా సంక్రాంతి పండుగ సందర్భంగా స్వర్ణముఖి నదిలో ప్రతి ఏటా ఏటి పండుగను మూడు రోజులు ఎంతో ఘనంగా చేపడతారు. అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాలను సైతం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు.



మేనకూరులో సెజ్ స్తూపం



మేనకూరులో ఉన్న వివిధ పరిశ్రమల బోర్డులు